## క్లుప్తంగా

### నేటి నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాత లాలుస్వామి ఉరుసు సందర్భంగా శనివారం నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు వరుసగా రూ.15,016, రూ.10,016, రూ.5,016 నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 9 గంటల్లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, రెండవ రౌండ్ నుంచి క్రీడాకారులకు భోజన వసతి కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 91773 16956, 70936 09328 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### క్రీడాకారుడికి అభినందన

తుగ్గలి: మూడు రోజుల క్రితం కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 విభాగం పోటీల్లో కర్నూలు జట్టు తరఫున మండల పరిధిలోని ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన అంజినాయక్ పాల్గొని సత్తాచాటాడు. ఈ మేరకు శుక్రవారం క్రీడాకారుడిని పలువురు అభినందించారు. జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అంజినాయక్ ప్రతిభతో కర్నూలు జట్టు మూడో స్థానంలో నిలిచిందని గిరిజన నాయకులు అశోక్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రఘు తెలిపారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా



కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని హేమలత

గోనెగండ్ల: ఇటీవల విజయనగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పెద్దనేలటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని హేమలత సత్తా చాటింది. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్న హుస్సేన్ మాట్లాడుతూ.. విజయనగరంలో ఈనెల 23, 24, 25 తేదీలలో నిర్వహించిన 66వ అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థిని హేమలత రన్నర్‌గా రాణించిందని తెలిపారు. ఈ సందర్భంగా హేమలతను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

### అమకతాడు విద్యార్థిని ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబరిచిన మాధవిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి: రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ బాలికల కబడ్డీ పోటీల్లో అమకతాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని మాధవి ప్రతిభ కనపరచినట్లు ప్రధానోపాధ్యాయుడు పార్థసారధి తెలిపారు. విజయనగరం జిల్లాలో ఈ నెల 23 నుంచి 25వతేదీ వరకు జరిగిన 66వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుతో కలిసి వెళ్లి ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన విద్యార్థిని మాధవి, తర్ఫీదునిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ శేఖర్‌ను శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

### పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు షాహిద్‌అఫ్రిద్ డిమాండ్ చేశారు.ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఇప్పటి నుంచే 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి సిలబస్ బోధిస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, అలాగే ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 వరకు క్లాసులు తీసుకుంటున్నారన్నారు. ఇలాంటి పాఠశాలలపై విద్యాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### ప్రహరీ వెంటనే పూర్తి చేయాలి

గోనెగండ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడను వెంటనే పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి, మండల కార్యదర్శి నాగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పిల్లిగుండ్ల పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పిల్లిగుండ్ల పాఠశాలలో నాడు-నేడు కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అయితే ప్రహరీ గోడ నిర్మాణ పనులకు గ్రామానికి చెందిన కోటయ్య అనే వ్యక్తి అడ్డుపడుతున్నాడని పేర్కొన్నారు. అతనిపై చర్యలు తీసుకొని, ప్రహరీ నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరారు. సీపీఐ నాయకులు శివ, దావీద్, హుస్సేన్, సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి చిరునామా సీఎం జగన్

- పుల్లగుమ్మిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు



పుల్లగుమ్మిలో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: దేశంలో ఎక్కడా లేని విధంగా నవరత్నాలతో పాటు, పలు పథకాలు అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమానికి చిరునామాగా మారారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. పేదల సంక్షేమానికి జగనన్న చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పెద్దకుంటలో పిచ్చిమొక్కలు పెరిగాయని గ్రామస్తులు చెప్పడంతో రానున్న వేసవిలో నీటిని తోడి పిచ్చి మొక్కలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. లేని సమస్యలు సృష్టించి ప్రతిపక్ష నాయకులు హంగామా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వారి నాయకుడు నారా లోకేశ్ మొదలెట్టిన పాదయాత్రలోనైనా జగనన్న పాలనలో ప్రజలకందుతున్న సంక్షేమ పథకాల గురించి, జరిగిన అభివృద్ధి గురించి తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. జెడ్పీటీసీ సుంకన్న, పుల్లగుమ్మి గ్రామ నాయకుడు, ఎంపీటీసీ నాగార్జున రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వర రెడ్డి, అచ్యుతానందరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఈఓఆర్డీ నరసింహులు, ఆర్‌ఐ అబ్దుల్ కలాం, ఏఓ అక్బర్‌బాషా, వివిధ శాఖల అధికారులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ విజయమోహన్ సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం 2080 మంది కూలీల ఉపాధి పనులకు వస్తున్నారని, రాబోవు రోజుల్లో ఇంకా కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెప్పారు. నిర్దేశిత కొలతల మేరకు పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం పొందవచ్చని సూచించారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఇబ్బంది పడకుండా ఉన్న గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకోవాలని, ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని చెప్పారు. చెక్‌డ్యాంలలో పూడిక తీత పనులు చేపట్టాలని, పని ప్రదేశంలో కూలీలకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

# మూగజీవాల వైద్యానికి ప్రాధాన్యత



వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూగజీవాలకు సైతం అత్యవసర వైద్యం అందించేందుకు ప్రాధాన్యతనిస్తూ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసం వద్ద గోనెగండ్ల పశు వైద్య శాఖ ఏడీ జి.వెంకటేశ్వర్లు, ఎంపీపీ కేశన్నలతో కలిసి డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనంలో పశువులకు అందించే చికిత్సా విధానాన్ని ఏడీ వివరించారు. పశువులను అంబులెన్స్ వాహనంలో ఎక్కించేందుకు హైడ్రాలిక్ లిఫ్టర్ ఉంటుందని మైక్రోస్కోప్‌తో కూడిన చిన్న ల్యాబ్, అన్ని రకాల వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అత్యవసరమైతే వాహనంలోనే సమీప ఆస్పత్రులకు తరలించే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పశువైద్యానికి 1962 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారని, పశుపోషకులు ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంలో సిబ్బంది వచ్చి వైద్య సేవలందిస్తారని వివరించారు. నియోజకవర్గంలో రెండు వాహనాలు ఏర్పాటు చేశారని పాడి రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారులు మహమ్మద్ ఆలీ, వీరేష్, ఎన్‌జీ వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పార్లపల్లె జయన్న, రామన్న తదితరులు పాల్గొన్నారు.

# కమ్మేసిన పొగమంచు



ఊరంతా మంచు దుప్పటి పరచుకున్నట్లుగా పొగ మంచు కమ్మేసింది. ఉదయం 8.30 గంటలైనా ప్రధాన రహదారి నిండా మంచు ఆవహించింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సూర్యుడి లేలేత కిరణాలు తాకుతూ మెల్లగా తెల్లారినట్లుగా మంచు పొరలు ఆవిరిగా మారి వాతావరణంలో కలిసిపోయాయి.

- పత్తికొండ రూరల్

# నవోదయ విద్యార్థులకు ప్రధాని సందేశం



లైవ్ వీడియో ద్వారా విద్యార్థులకు సూచనలిస్తున్న పీఎం నరేంద్రమోదీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ లైవ్ వీడియో ద్వారా విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా పట్టుదలతో చదవాలన్నారు. పరీక్షల్లో చీటింగ్ చేసి రాస్తే అది ఆ పరీక్ష వరకే ఉపయోగపడుతుందని, జీవితంలో ఉపయోగపడదని తెలిపారు. చీటింగ్‌పై ఉపయోగించే సృజనాత్మకతను మంచి మార్గంలో వాడితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. పరీక్షపై శ్రద్ధ పెట్టే విద్యార్థులకు శ్రమ వృథా కాదని చెప్పారు. ప్రిన్సిపాల్ కె. సాగరిక మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమంలో విద్యార్థులకు విలువైన సందేశాన్ని ఇచ్చారని తెలిపారు. విద్యార్థులు సంకల్పసిద్ధితో చదవితే మంచి ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ పోరుబాట పోస్టర్ విడుదల

హొళగుంద: సీపీఐ పోరుబాట పేరిట ఫిబ్రవరి 6న కర్నూలు కలెక్టరేట్, 22న విజయవాడలో చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గజ్జెళ్లి కాశాప్పాచారి కోరారు. శుక్రవారం హొళగుందలో పోరుబాటకు సంబంధించి పోస్టర్లను విడుదల చేసారు. ఈ సందర్భంగా కాశాప్పాచారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇంటి నిర్మాణాలకు ఇస్తున్న ప్రోత్సాహకం రూ.1.80 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆ పార్టీ సహాయ కార్యదర్శులు పెద్యాట మారెప్ప, రంగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్యాట శ్రీరంగ పాల్గొన్నారు.

# ఎడిసన్ సేవలు మరువలేనివి



ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికులు

ఆలూరు రూరల్: విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్ సేవలు మరువలేనివని ఆలూరు మండల లేబర్ ఆఫీసర్ కనక మహాలక్ష్మి, ఎస్ఐ డాక్టర్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ డే నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఎడిసన్ విద్యుత్ బల్బు కనిపెట్టి ప్రపంచానికి కాంతిని అందించారన్నారు. ప్రైవేటు విద్యుత్ కార్మికులందరూ ఈ-శ్రమ్ కార్డులను పొందాలని, ఏదేని ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఆధార్ కార్డుతో గ్రామ సచివాలయాల్లో సంప్రదిస్తే ఉచితంగా ఈ-శ్రమ్ కార్డును అప్లై చేస్తారన్నారు. అలాగే ఎస్ఐ నాయక్ మాట్లాడుతూ.. విద్యుత్ పరికరాల మరమ్మతులు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు థామస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు తహసీల్దార్ మల్లికార్జునకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు.

# మల్లెపల్లెలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో శుక్రవారం సుంకులా పరమేశ్వరి, పెద్దమ్మ, ఆంజనేయ స్వామి, అఘోరయ్య, ఎల్లమ్మ, కొండమ్మ, వాల్మీకి మహర్షి, నాభిశిల (బొడ్రాయి) విగ్రహాల, ధ్వజ స్తంభాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుడు లక్ష్మీకాంతరెడ్డి సహకారంతో ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజులపాటు సాగాయి. గ్రామంలో పండగ సందడి నెలకొంది. ప్రతి ఇంటా ఆడపడుచులు, బంధువుల కోలాహలం కనబడింది. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దేవతామూర్తులను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### డంపింగ్ యార్డులో మళ్లీ మంటలు

హొళగుంద: స్థానిక పెద్ద చెరువు వద్ద ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ (చెత్త సేకరణ కేంద్రం) వద్ద నిల్వ చేసిన చెత్త దిబ్బలకు మళ్లీ మంటలు చెలరేగాయి. 10 రోజుల క్రితం అవే చెత్త దిబ్బలకు అంటుకున్న మంటలను అప్పట్లో ఆర్పివేశారు. శుక్రవారం అదే ప్రాంతంలో తిరిగి మంటలు చెలరేగడంతో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి వాటర్ ట్యాంకర్‌తో మంటలు ఆర్పేందుకు చర్యలు చేపట్టి ఆలూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వాహనంతో వచ్చి మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగ షెడ్ పరిసరాల్లో స్థానిక రైతులు పదుల సంఖ్యలో గడ్డివాములు వేసుకున్నారు. అక్కడే ఉన్న చెత్త దిబ్బలకు తరుచూ మంటలు అంటుకుంటుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటున్నాయా? ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పు పెడ్తున్నారా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం గడ్డివాములకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా శ్రమిస్తున్నారు.

# బుల్లితెరపై ఆణిముత్యం



న్యూ టాలెంట్-2022 బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్ (ఫైల్)

- సివిల్ ఇంజినీరింగ్ చదివి నటనపై ముక్కువతో సినీరంగ ప్రవేశం
- ప్రముఖ తెలుగు, కన్నడ టీవీ సీరియళ్లలో కీలక పాత్రల్లో నటన
- త్వరలో రాబోతున్న నాలుగు తెలుగు సినిమాల్లో అవకాశం
- సినీ రంగంలో ప్రతిభ చాటుతున్న కమ్మరచేడు యువకుడు రాజ్‌కుమార్

ఆలూరు రూరల్: పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టి సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. రిలయన్స్, జిందాల్ స్టీల్ వంటి దిగ్గజ కంపెనీల నుంచి వచ్చిన ఉద్యోగాలను సైతం వద్దనుకున్నాడు. చిన్నతనం నుంచి నటనపై ఉన్న ఆసక్తి ఆ యువకుడిని బుల్లితెర వైపు నడిపించింది. పేదరికాన్ని జయించి.. బుల్లితెరపై మెరిసే అవకాశాన్ని సంపాదించుకున్నాడు. 2016 నుంచి టీవీ సీరియళ్ల డైరెక్టర్ సుమన్ బాబు అవకాశం ఇవ్వడంతో బుల్లితెరపై ఎంట్రీ ఇచ్చాడు. త్వరలో రాబోతున్న రెండు తెలుగు సినిమాల్లో నటించే అవకాశం సంపాదించుకున్నాడు మండలానికి చెందిన యువకుడు.

ఆలూరు మండలం, కమ్మరచేడు గ్రామానికి చెందిన రామాంజినేయులు, జలజాక్షి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. వీరి రెండో కుమారుడు రాజ్‌కుమార్. తమకున్న పదెకరాల వ్యవసాయ భూమి సాగు చేసుకుంటూ ఆ కుటుంబం జీవనం సాగిస్తోంది. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఆలూరు మండలం కమ్మరచేడు అనే మారుమూల గ్రామంలోని పుట్టి పెరిగి బుల్లితెరపై మెరుస్తున్న గ్రామీణ ఆణిముత్యం సహాయ నటుడు రాజ్‌కుమార్‌పై ప్రత్యేక కథనం.

**సీరియళ్లలో కీలక పాత్రల్లో అభినయం**

మా టీవీ, జీ తెలుగు, జెమిని టీవీ, ఈటీవీల్లో ప్రసారమయ్యే మనసు మమత, స్వాతి చినుకులు, పవిత్ర బంధం, గంగా-మంగా, మేనకోడళ్లు సీరియళ్లలో క్యారెక్టర్ ఆర్టిస్ట్(సహాయ నటుడు)గా వందల ఎపిసోడ్లు పూర్తి చేసుకున్నాడు రాజ్‌కుమార్. ఇందులో కొన్ని సీరియళ్లు ముగిశాయి. ఈ ఏడాది నుంచి భక్తి టీవీలో ప్రసారమయ్యే దుర్గమ్మ అనే మెగా సీరియల్‌లో విలన్ పాత్ర కోసం 30 ఎపిసోడ్లు పూర్తి చేశాడు. సీరియల్ పూర్తయ్యే వరకు ఇందులో నటించనున్నాడు. ఈ సీరియల్ ఈ ఏడాది మే నెల నుంచి బుల్లితెరపైకి రానుంది. అలాగే కన్నడ భాషలోని కగ్గల్, శ్రీరామ అల్ల శ్రీ కృష్ణ వంటి సీరియళ్లలో నటించాడు. కన్నడ సినీరంగంలో వచ్చే అవకాశాలను సైతం సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అలాగే ఈ ఏడాది సుమన్‌బాబు బ్యానర్‌లో రాబోతున్న గిద్దలూరు పోలీస్‌స్టేషన్, అమ్మ నాన్న మధ్యలో మధురవాణి వంటి సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అలాగే డైరెక్టర్ వినయ్ బాబు దర్శకత్వంతో రెండు సినిమాల్లో నటించే అవకాశం లభించింది.



దుర్గమ్మ సీరియల్ షూటింగ్‌లో రాజ్‌కుమార్

**న్యూ టాలెంట్-2022 బెస్ట్ యాక్టర్ అవార్డు**

ప్రముఖ టీవీ సీరియళ్లలో నటిస్తూ మంచి పేరు సంపాదించుకున్నాడు నటుడు రాజ్‌కుమార్. ఈయన ప్రతిభను గుర్తించి రుద్ర స్టూడియోస్ అనే హైదరాబాద్‌కు చెందిన సంస్థ న్యూ టాలెంట్ 2022 అవార్డుకు ఎంపిక చేసి ఈ నెల 22వ తేదీ హైదరాబాద్‌లో ప్రత్యేక ఈవెంట్ నిర్వహించి అవార్డును ప్రదానం చేసింది.

**ప్రముఖ సినీ బ్యానర్‌లో నటించాలన్నదే ఆశయం**



సినీ దర్శకుడు సముద్ర, వి.సుమన్ గారి సహకారంతో ప్రముఖ టీవీ ఛానళ్లలో వచ్చే సీరియళ్లలో నటించాను. ఇప్పటి వరకు వందలాది ఎపిసోడ్‌లలో నటించి మెప్పించాను. ప్రస్తుతం తెలుగు, కన్నడ సినిమాలు, సీరియళ్లలో నటించేందుకు అవకాశం వచ్చింది. ఇందులో నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాను. మైత్రీ మూవీస్, దిల్ రాజు, సూపర్ గుడ్ ఫిలిమ్స్, వారాహి, కన్నడలో హొంబలే వంటి ప్రముఖ బ్యానర్లలో నటించాలన్నదే నా ఆశయం.

- రాజ్‌కుమార్, సహాయ నటుడు

# జాతరలో పారిశుద్ధ్యం లోపిస్తే సహించం



పారిశుద్ధ్య కార్మికులను హెచ్చరిస్తున్న పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్

హొళగుంద: ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే సిద్ధేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. ఆలయ పరిసరాలు, తేరు వీధి, ఇతర కాలనీల్లో చెత్త చెదారం తొలగించాలని డ్రైనేజీలు శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. భక్తులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 25 మంది వరకు ఉన్న కార్మికులు బృందాలుగా ఏర్పడి ప్రతి కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



పిల్లల కోసం వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ కేఎల్‌ఆర్‌కే కుమారి

వెల్దుర్తి: పట్టణంలోని 5, 6, 8 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ కేఎల్‌ఆర్‌కే కుమారి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. టీచర్లు, హెల్పర్ల ద్వారా పిల్లలకు అందుతున్న బోధన, సేవలు, సౌకర్యాలు పరిశీలించారు. కోడిగుడ్లు, ఇతరత్రా వంట సామగ్రి, వండిన ఆహారం పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పిల్లలు కూర్చునే ప్రాంతాల వద్ద వంట వండకుండా దూరంగా వండేలా ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందిపై ఆగ్రహించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ శోభారాణి ఉన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి

ఎమ్మిగనూరుటౌన్: వాహన డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటసురేష్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్‌టీసీ డిపో ఆవరణలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణలపై డిపో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రజియా సుల్తానా ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడటం, మద్యపానం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తత అవసరమని, అతివేగం, అజాగ్రత్త పనికిరాదన్నారు. సురక్షిత ప్రయాణమే లక్ష్యం కావాలన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, ఏఎంఎఫ్ ఆంజినేయులు, డ్రైవర్లు, కండక్టర్లు, డిపో కార్మికులు పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామ పెద్దలు

మద్దికెర: మండల పరిధిలోని యడవలి గ్రామం జగనన్న కాలనీలో సుంకులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన రెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, గ్రామస్తులు కృష్ణారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నందవరం: ఆయా గ్రామ సచివాయాల్లో పెండింగ్‌లో ఉన్న చేదోడు దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామ సచివాలయాలన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో చేదోడు పథకానికి 157 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 62 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**జగనన్న చేదోడుకు 224 దరఖాస్తులు**

తుగ్గలి: జగనన్న చేదోడు పథకానికి మండలంలో 224 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా శుక్రవారం తెలిపారు. షాపులు ఉన్న నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేస్తారన్నారు.